# సీతారాం : చంద్రశేఖరం

ఆ యువకుడిపేరు శ్రీ ప్రపంచం సీతారాం.

అతడు నిజంగానే వేణుగాన ప్రపంచపు యువరాజు. తన 12వ ఏట మొట్టమొదటి సారిగా ఆకాశవాణి, విజయవాడ కేంద్రంనుండి తన వేణు గానాన్ని వినిపించిన సీతారాంను ఇప్పుడు కర్నాటకబాణీ వేణు విద్వాంసు లలో "మాలి" టి. ఆర్. మహాలింగం తర్వాత ప్రముఖుడిగా పరిగణిస్తారు. అతడు నిజానికి "మాలి" శిష్యుడు కూడాను.

1969 సెప్టెంబరు నెలాఖరున ఢిల్లీలో మోతీబాగ్‌లో శ్రీ సీతారాం చేసిన వేణుగాన కచ్చేరీగురించి వ్రాస్తూ ఒక విమర్శకుడు– "సీతారాం వేణుగానంలో మాలి సొగసులన్నీ వున్నాయి; కాని "మాలి" చేష్టలు "సీతారాంలో లేకపోవడం మన అదృష్టం" అన్నాడు. ఆనాడయితే నేమి, ఆ తర్వాత అక్టోబరు ఒకటవ తేదీన కన్నడ భారతివారి ఆధ్వర్యాన జరిగిన కచ్చేరీలోనయితేనేమి సీతారాం గానం- "మస్తమ్ మస్తమ్ మధుర నినదై ర్వేణు మాపూరయ న్తమ్"- అన్నట్లుగా శ్రవణానంద కరముగా వున్నది.

రామాయణంలో పిడకల వేటవలె, వేణుగానంలో అచ్చుతప్పుల కథ ఒకటివుంది.

శ్రీ సీతారాం కచ్చేరీలు జరిగిన రెండు సందర్భాలలోనూ ఇక్కడి ఆంగ్ల దినపత్రికల సంగీత విమర్శకులు (తప్పకుండా తమిళ సోదరులే అయివుండాలి) సీతారాంగారి పేరును "సీతారామన్"గా వేయించారు.

కర్నాటక సంగీతంలో ప్రతిభావంతులెవరయినా సరే తమిళులేతప్ప మరొకరుండబోరని కాబోలు ఈ శెన్‌దమిళ్ మగన్‌ల సదభిప్రాయం! అందులోనూ సీతారాం రెండవ కచ్చేరీ సందర్భంగా ఇచ్చిన కరపత్రంలో అతి స్పష్టంగా "ప్రపంచం సీతారాం" అని అచ్చులోవుంది. అయినాసరే సీతారాం సీతారామన్ కాక తప్పలేదు.

తమిళ సంగీత విమర్శకులు ఏమన్నా, ఏమనుకున్నా అదృష్టవశాత్తూ సంగీతరంగంలో తెలుగు వారు పైకి వస్తున్నారన్నది స్పష్టం. అంతేకాదు తెలుగువాడి సంగీతంలో శాస్త్రం ఒక్కటే కాకుండా మాధుర్యమూ వుంటుందన్నదనీ అందరూ అంగీకరించిన విషయం. కర్నాటక గాత్ర సంగీతంలో బాలమురళీకృష్ణ, వీణావాదనంలో ఈమని శంకరశాస్త్రి, చిట్టిబాబు, వేణుగానంలో సీతారాం ప్రభృతులు దిగ్గజాలవంటివారు.

## చంద్రశేఖర మాయ!

అబ్రహాం లింకనెక్కడ? అరవిందఘోషెక్కడ? రామకృష్ణ పరమహంసెక్కడ రాధాకృష్ణనెక్కడ? జవహర్లాలెక్కడ జాకిర్‌హుస్సేనెక్కడ!

ఈ మహాపురుషుల రూపురేఖా విలాసాలలో ఎంతెంత వ్యత్యాసమున్నది.

అయినా వీరందరివలెనే కనిపించగల శక్తిమంతుడొకాయన వున్నాడు. ఆయన శ్రీ వి. చంద్రశేఖరం, నెల్లూరి వాడయిన చంద్రశేఖరాన్ని "ఫన్ డాక్టర్", అంటారు. ఆయనకు దేవుడిచ్చిన మొహం ఒకటి. ఆ మొహంతో ఆయన తయారుచేసిన మొహాలు అనేకం. కేవలం మేకప్ మయూరి మాత్రమే కాదు చంద్రశేఖరంగారు గొప్ప నటుడు. ప్రదర్శకుడు; నలభై యేళ్ల నుంది తదేకదీక్షతో నాటకకళ నారాధిస్తున్న కళాతపస్వి. నాలుగు దశాబ్దాలుగా ఈ దేశంలోనూ, విదేశాలలోనూ లక్షలాది ప్రజలను ఆనందంలో,

ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాడు. ఆంగ్లంలోనూ ఆంధ్రంలోనూ అనర్గళంగా మాట్లాడుతూ, అవలీలగా నటిస్తూ ఇటు కన్నీరు అటు పన్నీరు ఒలికించగల చంద్రశేఖరాన్ని గౌరవించలేక పోయిన కళా అకాడమీలుండడం మన దౌర్భాగ్యం.

ఇక్కడి గాంధీ దర్శన్ ప్రదర్శనలోని ఆంధ్రప్రదేశ్ విభాగంలో గాంధీ వేషంలో కనపడిన చంద్రశేఖరాన్ని చూచి చేతులెత్తి నమస్కరించిన వారెందరో వున్నారు.

ఆయన నగరంలోవున్న సందర్భంలో ఫరీదాబాద్ ఆంధ్ర సంఘం వారూ, కరోల్ బాగ్ ఆంధ్ర మాధ్యమిక పాఠశాల, పూసా ఆంధ్రసంఘం వారూ చంద్రశేఖరంగారి కార్యక్రమాల నేర్పరచి వందలాది జనులకా మహా నటుడి కళా వైదుష్యాన్ని కని ఆనందించే మహదవకాశం కల్పించారు

(31 అక్టోబర్ 69)